క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శలో గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు

రణస్థలం: దేవరాపల్లి సర్పంచ్ మీసాల శ్రీనివాసరావు తల్లి మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె అప్పలనాయుడు, మీసాల తవిటినాయుడు, గెడ్డపు తమ్మినాయుడు, పిసిని సత్యం, చందక రామునాయుడు, మీసాల సత్యనారాయణ, మీసాల రమేష్ బాబు ఉన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ కూడా సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, పిన్నింటి లక్ష్మనాయుడు, మహంతి జోగినాయుడు, కిల్లారి సన్యాసినాయుడు, మహంతి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..



సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

గార: తమతో కలిసి పదో తరగతి వరకు చదివిన తోటి స్నేహితురాలు అనారోగ్యం బారిన పడటంతో మిత్రులు స్పందించి ఆర్థిక సాయం అందించారు. అంపోలు గ్రామానికి చెందిన కుర్మాన నారాయణమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో అంపోలు జెడ్పీ హైస్కూల్ 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.50 వేలు సేకరించి శనివారం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, గుజ్జల హిమగిరి, పాదిలాపు కృష్ణ, ముద్దాడ చలపతిరావు, శిమ్మ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: ఫరీదుపేటలో మండల పరిషత్ నిధుల నుంచి సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులను ఎంపీపీ మొదలవలస చిరంజీవి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతలో రాజీపడకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్టాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

గార: మండల కేంద్రం గార పంచాయతీ కుమ్మరిపేటలో పునఃనిర్మించిన ఉమా సహిత నీలకంఠేశ్వర స్వామి పంచాయతన దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల నిర్వహణలో అర్చకులు జాడ వెంకట సంతోష్‌శర్మ, బ్రహ్మశ్రీ ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో విగ్రహమూర్తులు, మంత్ర, యంత్ర ప్రతిష్టలు, విశేష హోమాలు జరిగాయి. ఎమ్మెల్యే గొండు శంకర్ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం నాలుగు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

- రిమ్స్‌లో ప్రారంభానికి నోచుకోని భవనాలు
- ఫర్నిచర్ లేదన్న సాకుతో కాలయాపన
- వైద్య విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

నిర్మించి.. నిరుపయోగంగా వదిలేసి..!

ప్రారంభానికి నోచుకోని వసతిగృహం



నిర్మాణం పూర్తయిన క్యాంటీన్ భవనం





దిశా పోలీస్‌స్టేషన్ కోసం నిర్మించిన భవనం



నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాని లైబ్రరీ భవనం

శ్రీకాకుళం: భవనాలను నిర్మించడంలో ఉన్న శ్రద్ధ వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో చూపడం లేదు. ఫలితంగా భవనాలు నిరుపయోగంగా మారడంతో పాటు వాటి నిర్మాణం వెనుకున్న లక్ష్యాలు నెరవేరని పరిస్థితి నెలకొంటోంది. ఇదే తరహాలో శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో పలు కొత్త భవనాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. వీటి నిర్మాణం పూర్తయి రెండేళ్లు కావస్తున్నా రిమ్స్ అధికారులు వీటిని స్వాధీనం చేసుకోవడం లేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఫర్నిచర్ లేకుండా భవనాలను స్వాధీనం చేసుకొని తామెలా వినియోగిస్తామని రిమ్స్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇలా పరస్పరం ఒకరిపై ఒకరు కారణం నెట్టుకుంటూ భవనాలను మాత్రం నిరుపయోగంగా మార్చేస్తున్నారు. వీటిలో లైబ్రరీ, దిశా పోలీస్ స్టేషన్, యూజీ గర్ల్స్ హాస్టల్, క్యాంటీన్ వంటి భవనాలు ఉన్నాయి.

విద్యార్థులు గగ్గోలు పెడుతున్నా..

క్యాంటీన్ లేకపోవడం వల్ల విద్యార్థులతో పాటు రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో భోజనాలు బాగోవడం లేదని పలు సందర్భాల్లో విద్యార్థులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ క్యాంటీన్ ప్రారంభ చేయాలన్న ఆలోచన ఏ ఒక్కరిలోనూ ఉండటం లేదు. క్యాంటీన్ నిర్వహణకు టెండర్ పూర్తి చేస్తే సంబంధిత కాంట్రాక్టర్ అందులో ఫర్నిచర్ సమకూర్చుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు హాస్టల్ భవనాలు సరిపోవటం లేదని విద్యార్థినులు ఎప్పటినుంచో గగ్గోలు పెడుతున్నారు. 250 పడకల సామర్థ్యం కలిగిన హాస్టల్ భవనం నిర్మాణం పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా దీనిని స్వాధీనం చేసుకోలేదు. ఇందులో మంచాలు, ఇతర ఫర్నిచర్ లేదని రిమ్స్ అధికారులు సాకుగా చూపిస్తున్నారు.

సుందరీకరణ పేరిట ఖర్చు..

ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు రూ.12 లక్షల నిధులను రిమ్స్ కళాశాల ఆవరణ సుందరీకరణ పేరిట ఖర్చు చేశారు. ఈ మొత్తం వినియోగిస్తే హాస్టల్‌లో ఫర్నిచర్ సమకూర్చుకునేందుకు వీలుండేది. ఇవే నిధులతో లైబ్రరీకి అవసరమైన ఫర్నిచర్ కూడా కొనుగోలు చేసే అవకాశం ఉండేది. దిశా పోలీస్ స్టేషన్ నిర్వహణకు భవనాన్ని నిర్మించినా పోలీస్ శాఖ స్వాధీనం చేసుకోవడం లేదు. రిమ్స్ అధికారులు తొలుత ఈ భవనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. దీనికి కూడా రిమ్స్ అధికారులు సుముఖత చూపడం లేదు. ఇందుకు గల కారణాలు తెలియరావడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

క్యాంటీన్ లేక ఇబ్బందులు

మా బంధువుల్ని చికిత్స కోసం రిమ్స్‌లో చేర్పించాం. ఐదు రోజులు పాటు ఉండాల్సి వచ్చింది. ఆసుపత్రి పరిసరాల్లో టిఫిన్ గానీ భోజనం గానీ లేదు. దీనివల్ల భోజనానికి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వెళ్లాల్సి వచ్చేది.

– తిరుమలరావు, రోగి సహాయకుడు

వినియోగంలోకి తేవాలి..

రిమ్స్ ఆవరణలో నిర్మించిన భవనాలు ఫర్నిచర్ లేక నిరుపయోగంగా మారాయి. ఇంజినీరింగ్ అధికారులు సుందరీకరణకు వెచ్చించిన డబ్బును ఫర్నిచర్ కొనుగోలుకు వెచ్చించి ఉంటే వైద్య విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేది.

– డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి

కోటి సంతకాల సేకరణకు క్లస్టర్ ఇన్‌చార్జిలు

- నకిలీ మద్యంపై ర్యాలీ రేపు
- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడతున్న కోటి సంతకాల సేకరణకు క్లస్టర్ ఇన్‌చార్జిలను నియమిస్తున్నట్లు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ ఇన్‌చార్జిల నిమాయకం వల్ల సంతకాల సేకరణ సులభతరం అవుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 60 వేలు సంతకాలు సేకరించాలని సూచించారు.

నకిలీ మద్యంపై 13న భారీ ర్యాలీ

కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమలా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ప్రాణాలను హరిస్తోందని కిరణ్ దుయ్యబట్టారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 13న ఉదయం 10 గంటలకు రణస్థలం మండలం జె.ఆర్.పురం పంచాయతీ రామతీర్థాలు కూడలి నుంచి సంతోషి మాత గుడి వద్ద ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ



కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల విద్య, ఆరోగ్యానికి ఇబ్బంది కాకుడదనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలలను నిర్మాణం తలపెడితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేటుపరం చేయడం దారుణమన్నారు. చంద్రబాబు చేస్తున్న అరాచకాలను ప్రజలకు తెలియజేసి కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపే దిశగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివారాధనతో పుణ్యం

శ్రీకాకుళం కల్చరల్: పుష్పదంత కృత 'శివ మహిమ్నః స్తోత్రం' ఆధ్యాత్మిక విశ్వంలో అత్యంత గంభీరమైన స్తోత్రమని నిష్టల నర్సింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో శివ మహిమ్నః స్తోత్రంపై శనివారం ప్రసంగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నారాయణమూర్తి, సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, పట్నాయిక్, వెంకటరమణ, బాబూరావు, మురళీకృష్ణ, అరుణ, సరస్వతి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని ఖ్యాతి వృద్ధాశ్రమానికి కరెంటు సమస్య లేకుండా దాతలు శనివారం ఇన్వర్టర్ వితరణ చేశారు. బలగ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న శ్రావణజ్యోతి కోరిక మేరకు ముంజేటి బాబు సాయిరాం, మైలపిల్లి వైకుంఠరావులు ఈ ఇన్వర్టర్‌ను అందించారు.



ఇన్వర్టర్ అందజేస్తున్న దాతలు

క్యాంపస్ డ్రైవ్‌లో పలువురు ఎంపిక

ఎచ్చెర్ల: మండల కేంద్రం ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మైక్రోటెక్ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్(బెంగళూరు) సంస్థ నిర్వాహకులు శనివారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. హెచ్‌ఆర్ మేనేజర్ గాయత్రిసత్యప్రసన్న హాజరై 11 మందిన ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి ఆరు నెలలు శిక్షణ అనంతరం వార్షిక జీతం రూ.4 లక్షలు ఉంటుందని చెప్పారు. కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.రమణమూర్తినాయుడు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కార్యక్రమంలో విభాగాధిపతులు డి.తిరుమలరావు, రాజు, ఎం.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, ఇతర బీసీ సంఘం సభ్యులకు శనివారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అమీరుల్లా బేగ్, రాష్ట్ర కార్యదర్శి లోకనాథం నాగరాజు, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావుల ఆధ్వర్యంలో వీటిని అందజేశారు.



గుర్తింపు కార్డులు అందజేస్తున్న ప్రతినిధులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో సీఎఫ్ఎంఎస్ డైరెక్టర్



ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో శ్రీనివాస్

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని రాష్ట్ర ఆర్థిక నిర్వహణ సంస్థ (సీఎఫ్‌ఎంఎస్) డైరెక్టర్ వేంద్ర శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. మూలవిరాట్‌కు పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి, రాతి స్తంభాలు, వైష్ణవిదుర్గ, తాబేళ్ల పార్కులను సందర్శించారు. ప్రధానార్చకులు చామర్ల సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని వివరించారు.

నందెన్నకు దీపారాధన




దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజలలేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న నందెన్న ఉత్సవాలలో భాగంగా శనివారం దీపారాధన నిర్వహించారు. అర్చకులు అశ్వినీ కుమార్, మహేష్ ఆధ్వర్యంలో నందెన్నకు పూజలు మహిళలు దీపాలు వెలిగించారు.

మారకపోతే ముప్పే!

- రిమ్స్‌కు వస్తున్న ఆర్థోపెడిక్ కేసుల్లో 40 శాతం ఆర్థరైటిస్‌వే
- వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్లే కారణం
- నేడు ప్రపంచ ఆర్థరైటిస్ డే



శ్రీకాకుళం:

వ్యాయామం చేయకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు పాటించకపోవడం వంటి కారణాలతో ఇటీవల కాలంలో ఆర్థరైటిస్(కీళ్లనొప్పులు) బాధితుల సంఖ్య పెరుగుతోంది. రిమ్స్‌కు వస్తున్న ఆర్థోపెడిక్ కేసుల్లో దాదాపు 40 శాతం మంది వరకు ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారే. సాధారణంగా ఆర్థరైటిస్ వ్యాధి 55 ఏళ్ల దాటిన వారిలో కనిపిస్తోంది. కానీ నేడు యువత సైతం ఈ వ్యాధి బారిన పడుతుండడానికి కారణం మారిన జీవన శైలే కారణమని తెలుస్తోంది. జంక్ ఫుడ్స్‌కు యువత బాగా అలవాటు పడిపోయారు. వీటిని తిన్న తర్వాత ఉద్యోగరీత్యాగాని మరేదైనా కారణంతో గానీ ఒకే చోట గంటల తరబడి కూర్చొని ఉండడం, పూర్తిగా వ్యాయామం లేకపోవడం ఆర్థరైటిస్ వ్యాధి బారిన పడేందుకు కారణమవుతున్నాయి. మద్యపానం, ధూమపానంతో పాటు డ్రగ్స్ తీసుకోవడం వల్ల కూడా ఎముకలు బలహీనపడి ఆర్థరైటిస్ బారిన పడి నడవలేని స్థితికి చేరే ప్రమాదముంది. మహిళల్లో మోనోపాజ్ దశలో హార్మోన్‌లలో సమతుల్యత లోపించి ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. కొందరిలో మాత్రం వంశపారపర్యంగా కూడా ఆర్థరైటిస్‌కు గురయ్యే అవకాశాలున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. జీవన శైలిని మార్చుకొని నిత్యం వ్యాయామం చేస్తే ఆర్థరైటిస్ బారి నుంచి తప్పించుకోవచ్చని అంటున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవే..

- ఆర్థరైటిస్ వ్యాధి బారిన పడిన వారికి కీళ్ల నొప్పితో ప్రారంభమవుతుంది. తర్వాత వాపు వచ్చి పూర్తిగా నడవలేని స్థితికి చేరుకుంటారు. ఉదయం నిద్ర లేవగానే జ్వరం వచ్చినట్లు అనిపించి కీళ్లనొప్పులు బాధిస్తాయి.

వ్యాయామమే రక్ష..



నిత్యం వ్యాయామం చేస్తే ఆర్థరైటిస్ బారిన పడకుండా ఉండొచ్చు. సైక్లింగ్, వాకింగ్ వంటివి అలవాటు చేసుకోవాలి. ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. ముఖ్యంగా జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి.

– డాక్టర్ ప్రసన్నకుమార్, ఆర్థోపెటిక్ విభాగాధిపతి, రిమ్స్ ఆసుపత్రి

రిమ్స్‌లో శస్త్ర చికిత్సలు..

ఆర్థరైటిస్ వ్యాధి పూర్తిగా ముదిరిపోతే గ్రేడ్ 4 ఆర్థరైటిస్‌గా పేర్కొంటారు. ఈ దశలో రోగికి శస్త్ర చికిత్స అవసరం. ఆరోగ్యశ్రీలో 20 ఎముక మార్పిడికి అవకాశం ఉన్నప్పటికీ మోకాళ్ల చిప్పమార్పిడికి అవకాశం లేదు. అయితే రూ.75,000 విలువైన శస్త్ర చికిత్స పరికరాలు కొనుగోలు చేసుకుంటే వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు మోకాళ్ల శస్త్ర చికిత్సలు 250, తుంటి ఎముక శస్త్ర చికిత్సలు 100కు పైబడి విజయవంతంగా పూర్తి చేశారు.

ఆదమరిస్తే అంతే

చిలకపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువ పలక ఊడిపోయింది. దీంతో వాహనచోదకులు ఏమాత్రం ఆదమరిచినా ఇక్కడ ప్రమాదానికి గురికాక తప్పదు. సంబంధిత అధికారులు స్పందించి పలక సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల



అడుగడుగునా గోతులే



లావేరు మండలంలో జాతీయ రహదారి నుంచి బొంతుపేట వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులు ఏర్పడి అందులో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఎచ్చెర్ల

సత్యప్రసాద్ మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పైడి సత్యప్రసాద్ ఆకస్మిక మృతిపట్ల సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం శనివారం సంతాపం తెలియజేసింది. సత్యప్రసాద్ తండ్రి శ్రీరామ్మూర్తి ఆమదాలవలస ఎమ్మెల్యేగా పదవిలో ఉన్న సమయంలో మృతిచెందడంతో అప్పటి ప్రభుత్వం ఈయన్ను 1992–97లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా నియమించింది. సత్యప్రసాద్ మృతిపట్ల సంఘం ప్రతినిధులు టి.వైకుంఠరావు, జి.విశ్వేశ్వరరావు, పి.శ్రీరాములు, కె.బి.సుబ్రహ్మణ్యం, ఎస్.వి.కె.రాజాచార్యులు, ఎస్.వి.రమణమూర్తి, ఎం.చంద్రశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకం



పొన్నాన మాధవరావు



తెంబూరు గిరి



బర్రి నారాయణస్వామి



చామర్తి భాస్కరరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురిని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు జారీచేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టారు. జిల్లా అఫిలియేటెడ్ విభాగంలో జిల్లా యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పొన్నాన మాధవరావు, శ్రీకాకుళం నియోజకవర్గ ఎఫిలియేటెడ్ విభాగం అధ్యక్షుడి(ఎస్టీ సెల్ విభాగం)గా తెంబూరు గిరి, వలంటీర్ వింగ్ అధ్యక్షుడిగా బర్రి నారాయణస్వామి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా చామర్తి భాస్కరరావులను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు.